క్లుప్తంగా

రోడ్డు మరమ్మతుకు ఆదేశం


రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గుడిపాల : మండలంలోని చిత్తూరు–వేలూరు మార్గంలో మద్రాస్‌క్రాస్ వద్ద దెబ్బతిన్న ఆర్ అండ్‌బీ రోడ్డును కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మంగళవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో రాకపోకలకు తలెత్తుతున్న ఇబ్బందులపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్డుకు సత్వరమే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, చుడా చైర్మన్ హేమలత, మాజీ ఎమ్మెల్యేలు గాంధీ, మనోహర్ పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా


మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ ఆదేశించారు. మంగళవారం స్థానిక అర్బన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అదనపు లోడ్ ఉండే ప్రాంతాలను గుర్తించి స్టోర్స్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాలని సూచించారు. అవసరమైన చోట్ల కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ బిల్లులను వందశాతం వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. 2022 వర్క్‌ఆర్డర్లను ఈనెలలోపు క్లోజ్‌చేయకపోతే సంబంధిత ఏఈల జీతాల నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం కొంగారెడ్డిపల్లె సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ డీఈ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, వాసుదేవ రెడ్డి, డీఈలు ఆనంద్ పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని పాలకల–2, మల్లారపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో రెండు గ్రామాల్లో 85 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సర్వే చేసి భూమిని అప్పగించాలి


మాట్లాడుతున్న బాధితులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తన భార్య వనమ్మ పేరిట ఉన్న భూమిని సర్వే చేసి అప్పగించాలని చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కుప్పయ్య అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదమరి మండలం కుక్కలపల్లిలో 2009లో ప్రభుత్వం వ్యవసాయ భూములను మంజూరు చేసిందన్నారు. దీనిపై పట్టాపాసుదారు పుస్తకాలు జారీ చేశారని పేర్కొన్నారు. 2019 వరకు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదై ఉన్నాయని, అయితే భార్య వనమ్మ చనిపోయిన తరువాత ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి ఏపీఐఐసీ అధికారులు కుక్కలపల్లి వద్ద ఉన్న ప్రైవేట్ ఫ్యాక్టరీ వాళ్లకు తమ భూములను అప్పగించారని ఆరోపించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఉపాధి పనుల్లో భాగంగా తవ్విన కుంటలో చేరిన నీరు


యాదమరి మండలంలోని ఉపాధి హామీ కూలీలు


భూగర్భం.. నింపుదాం..!

జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు వాటిని సంరక్షించుకుంటే రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి నుంచి గట్టెక్కవచ్చని భావిస్తోంది. ఈ మేరకు వచ్చే ఏడాది నుంచి ఉపాధి హామీలో జల సంరక్షణ పనులు విరివిగా చేయాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజలకు అవగాహన కల్పించడానికి వివిధ రకాల కార్యక్రమాలను రూపకల్పన చేసింది.దీనిపై క్షేత్ర సహాయకులకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు.

- ఉపాధి హామీ పథకంలో జల సంరక్షణ పనులు
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- పనుల గుర్తింపులో అధికారులు
- క్షేత్ర సహాయకులకు శిక్షణ

కాణిపాకం: యాదమరి మండలంలో 7,510 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. 5,413 మంది కూలీలుగా నమోదయ్యారు. ప్రస్తుతం 2,800 మంది పనిచేస్తున్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన పనులను ఆ ఏడాదిలోపు పూర్తి చేయాలని, మరుసటి ఏడాది ఉపాధి హామీ కింద వాటిని చేయరాదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో గ్రామసభలో చేసే తీర్మానాలతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించడానికి గ్రామీణాభివృద్ధి సిబ్బంది ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కేంద్రం ఆదేశాలతో..

కేంద్రం ఆదేశాలతో 2025–26లో ఉపాధి హామీలో చేపట్టే జల సంరక్షణ పనులను క్షేత్రస్థాయిలో గుర్తించేందుకు శాఖ అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. డిసెంబర్ నాటికి పనులు గుర్తింపు పూర్తి చేసి వాటిని ప్రారంభించడానికి అనువుగా గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇంకుడు గుంతల పరంగా....

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి పూనుకునే వారు ఇక నుంచి తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మించుకోవాలన్న నిబంధన అమల్లో ఉంది. కానీ క్షేత్ర స్థాయిలో దీనిని ఎవరూ పాటించడం లేదనేది నిర్విదాంశం. పలువురు రూ.లక్షలు వెచ్చించి ఇళ్ల నిర్మించుకుంటున్నారు. కానీ వేలల్లో వ్యయమయ్యే ఇంకుడు గుంతల విషయంలో మాత్రం శ్రద్ధ చూపించడం లేదు. దీంతో నీటి సంరక్షణకు అడుగులు ముందుకు పడటం లేదు. దీనికి ఫుల్ స్టాప్ పెట్టడానికి ఇంకుడు గుంతలు నిర్మిస్తేనే ఇళ్ల నిర్మాణ అనుమతులు ఇచ్చే విధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించి వాటిని కచ్చితంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

జలసంరక్షణలో చేసే పనులు

ఉపాధి హామీ పథకం కింద జల సంరక్షణలో చేసే పనుల్లో ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వల గుంతల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. సింగిల్ ఫేజ్ మోటార్లు, చేతి పంపుల వద్ద, ఇళ్లలో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడుతారు. ఇంటి పైభాగంలో కురిసిన వర్షపు నీటిని భూమిలోకి వెళ్లేలా (రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్) నిర్మాణాలు, ఖాళీ స్థలాలు, పంట పొలాల చుట్టూ కందకాల ఏర్పాటు, అనువైన చోట చిన్నపాటి కుంటల నిర్మాణాలు చేపట్టనున్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు..



ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీలో భాగంగా వచ్చే ఏడాది జల సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. ఈఏడాదిలో ఇప్పటికే నీటి నిల్వ గుంతల నిర్మాణాలు చేపట్టాం. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం నీటి ఎద్దడి నివారణ కోసమే జల సంరక్షణ పనులు చేపడుతున్నాం. దీనిపై క్షేత్ర సహాయకులకు రెండ్రోజులు శిక్షణ కూడా ఇస్తాం.

– బాల, ఏపీఓ, యాదమరి

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. కరెంట్ సమస్యలపై ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఈఈ మునిచంద్ర తెలిపారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

27న ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్‌శాఖ ఓసీ ఉద్యోగుల సంఘం 2025వ సంవత్సర రాష్ట్ర డైరీని ఈనెల 27వ తేదీన ఆవిష్కరించనున్నారు. మంగళవారం ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శేషాద్రి, జిల్లా కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ నెల్లూరులో నిర్వహించనున్న ఆవిష్కరణకు ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని క్రైమ్ సీఐ ఉమామహేశ్వర్ విద్యార్థులకు సూచించారు. చిత్తూరు, మురకంబట్టులోని అపోలో కాలేజీలో మంగళవారం సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మోసాలకు అమాయకులు బలవుతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు అవగాహన కలిగి ప్రజలకు వివరించాలన్నారు. ఎస్ఐ నాగసౌజన్య మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో పోలీసు శాఖ ముందుండి పనిచేస్తోందన్నారు. మహిళలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. అధ్యాపకులు హసీనా, కల్యాణి, యోగిని పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో రోడ్ల విస్తరణ


మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

చిత్తూరు అర్బన్ : ప్రజా సహకారంతోనే నగరంలో రోడ్లు విస్తరించనున్నట్లు ఎమ్మెల్యే జగన్‌మోహన్ నాయుడు, మేయర్ అముద తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్‌తో కలిసి రోడ్లు విస్తరించాల్సిన ప్రాంతాలను సందర్శించారు. ఈ మేరకు మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచని వివరాలను అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హైరోడ్డు, వేలూరు రోడ్డు, గిరింపేట, దుర్గమ్మ ఆలయం వరకు మార్కింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రజలు సైతం నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే మనోహర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి

– జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ


మాట్లాడుతున్న డీఏఓ మురళీకృష్ణ

ఐరాల: రబీ సీజన్‌లో ఉత్తమ యాజమాన్య పద్ధతులతోనే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని 35 యర్లంపల్లెలో స్థానిక సర్పంచ్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. వరి, వేరుశనగ పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటకు ఈనెల 31లోపు, వేరుశనగ పంటకు 15వ తేదీలోపు బీమా చెల్లించాలన్నారు. వ్యవసాయంలో పాటించాల్సిన మేలైన పద్ధతులు రైతులకు తెలిసేలా అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. ఏడీఏ ఉమ, పశుసంవర్ధక శాఖ ఏడీఏ పద్మావతి, ఏఈఓలు ద్రాక్షాయని, ఆనంద్, సెరికల్చర్ అసిస్టెంట్ గణేష్, ఎస్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ హనుమంతు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


మైనగుండ్లపల్లెలో వైద్యపరీక్షలు


సరకల్లులో..

తవణంపల్లె: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని మైనగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 35 మందికి వైద్య పరీక్షలు చేశారు.

సరకల్లులో.. మండలంలోని సరకల్లులో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యబృందం పర్యటించారు. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 42 మందికి వైద్య పరీక్షలు చేశారు.

పిండ మార్పిడి విజయవంతం

కాణిపాకం: పూతలపట్టు మండలం పి.కొత్తకోటలో మంగళవారం పశువుల్లో పిండ మార్పిడి పద్ధతిని విజయవంతంగా నిర్వహించారు. పశువైద్యాధికారి శివనాగరాజు మూడు నెలల క్రితం జెర్సీ, గిర్ ఆవు పిండం మార్పిడి చేయగా విజయవంతమైంది. ఈ పద్ధతని పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ పరిశీలించారు. అనంతరం ఆవులకు పోషక పదార్థాలు అందజేశారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం


గుడిపాల: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుడిపాల: సీఎన్ఆర్ కళాశాలలో మంగళవారం ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్ మాట్లాడుతూ మనిషికి స్వేచ్ఛ, సమానత్వమే మానవ హక్కుల ఉద్దేశమన్నారు. కుల,మత వర్గ రహితంగా అందరికీ మానవ హక్కులను మన రాజ్యాంగం ప్రసాదించిందని తెలిపారు. ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి పుట్టుకతోనే కొన్నిహక్కులు లభిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అర్జున్, అధ్యాపకులు రంజిత్‌కుమార్, గాయత్రి పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులకు మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: వడ్డీ వ్యాపారుల వేధింపులకు తాళలేక ఓ మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు..పట్టణంలోని కొత్తయిండ్లులో నివాసమున్న షబానా కుటుంబ అవసరాల నిమిత్తం పలువురి వద్ద అప్పులు చేసింది. సకాలంలో వడ్డీతోపాటు అప్పు అసలు చెల్లించినప్పటికీ ఇంకా బాకీ ఉన్నావంటూ వడ్డీ వ్యాపారులు వేధించడం, అవమానించడంతో పాటు వారి వికృత చేష్టలకు కుంగిపోయింది. మంగళవారం ఇంట్లోనే నిద్ర మాత్రలు మింగింది. అపస్మారస్థితిలో ఉన్న షబానాను గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతోంది. పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆమె ఎవరెవరి వద్ద, ఎంత మొత్తంలో అప్పు చేసింది? వేధిస్తున్న వారెవరో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన


నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నేతలు నిరసన తెలిపారు. మంగళవారం నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదానీకి మోదీ, చంద్రబాబు తొత్తులుగా మారిపోయారని ఆరోపించారు. మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు మణి, రమాదేవి, దామోదరం, మహేష్ , విజయకుమార్, కుమారి, కవిత పాల్గొన్నారు.

గర్భిణుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వద్దు


సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గర్భిణుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వద్దని, మాతాశిశు మరణాల కట్టడికి విధిగా పనిచేయాలని డీఐఓ హనుమంతరావు, గైనిక్ వైద్యులు ఉషశ్రీ సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం మాతాశిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. మరణాలకు గల కారణాలపై డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ శిశు మరణాలపై గర్భిణులకు, కుటుంబీకులకు అవగాహన కల్పించి నివారణకు కృషిచేయాలని పేర్కొన్నారు. వైద్యులు లత, జానకీరావ్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

గుడిపాల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. మంగళవారం గుడిపాలలో చేపట్టిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తన భూములకు సంబంధించిన సమస్యలపై అధికారులకు అర్జీలు అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని తంబుగానిపల్లెలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ప్రజల నుంచి 15 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ దారి సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరించారు. ఆర్ఐ మధుసూదన్, మండల సర్వేయర్ లావణ్య, వీఆర్ఓలు సురేంద్ర, రఘునాథ్, సునీల్, నాగరాజ, రూపేష్, వెంకటరత్నం, సుజిత్ పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని మత్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ సదస్సులో ఆరు అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఎంఆర్ఐ జీవన్‌సాగర్, సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్ఓలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. బుధవారం ముట్టుకూరులో రెవెన్యూ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు.


బంగారుపాళెం: తంబుగానిపల్లెలో..


మత్యం రెవెన్యూ సదస్సులో..






మంచు కురిసే వేళలో..!

పల్లెలు ప్రకృతి రమణీయతకు నెలవు. చల్లదనానికి మారుపేరు. శీతాకాలం కావడంతో రాత్రిళ్లు కురుస్తున్న మంచు తెరలు తెల్లవారిన తరువాత కూడా తొలగడం లేదు. దీంతో ప్రకృతి రమణీయత మనసులను ఆహ్లాదపరుస్తోంది. ప్రజలు, వాహనదారులు, ప్రకృతి ప్రేమికులు పులకిస్తున్నారు. మంగళవారం ఉదయం బంగారు పాళెంను పొగమంచు దట్టంగా ఆవరించింది. ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు పొగ మంచు కమ్మేసింది. ఆవరించింది. దీంతో ఎదురుగా వస్తున్న వారు దగ్గరకు వచ్చేంత వరకు తెలియనంతగా మారింది. జాతీయ రహదారిపై వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. దీనిని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించారు.

– బంగారుపాళెం